క్లుప్తంగా

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



ఫెర్రీరోడ్డులో తాగునీటి కుళాయిల వద్ద నీటిని చూపిస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ : తాగునీటిలో మురుగు నీరు కలిసిపోవటంతో ప్రజలు వ్యాధులకు గురవుతున్నారని కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డులో జెడ్సీ కె.శివప్రసాద్‌తో కలిసి పర్యటించారు. ఫెర్రీరోడ్డు, ఉడ్‌యార్డు స్ట్రీట్ ప్రాంతాల్లో మురుగు కాలువల్లో తాగునీటి పైపులు ఉండడంతో తాగునీటిలో ఆ మురుగు నీరు కలిసిపోతుందని తెలిపారు. అనంతరం వార్డులో రహదారులు, పరసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలి మృతి

అల్లిపురం : ఆర్టీసీ బస్సు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ద్వారకాబస్ స్టేషన్ వద్ద భిక్షాటన చేసుకునే ఆమె ప్రమాదవశాత్తు 38 హెచ్ బస్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని మార్చురీకి తరలించారు. సుమారు 5 అడుగుల ఎత్తు కలిగిన ఆమెను గుర్తించిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ బి.తిరుమలరావు కోరారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9908001600 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పేదల సేవల్లో రాజీలేదు

దాబాగార్డెన్స్ : రాజీ లేకుండా పేదలకు సేవ చేస్తానని ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. ఇటీవల ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ సంస్థ డాక్టరేట్ అందించిన విషయాన్ని పురస్కరించుకుని మంగళవారం డాక్టర్ కంచర్లను పలువురు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా పేదలు, క్రీడాకారులు, కళాకారులకు సేవ చేస్తానని చెప్పారు. తన సేవలు గుర్తించి ఏ రాజకీయ పార్టీ అయినా టిక్కెట్ ఇస్తే పోటీ చేస్తానని, లేదంటే ప్రజాభీష్టం మేరకు స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తానని తెలిపారు.

చెట్టు కొమ్మల తొలగింపు



చెట్టుకొమ్మలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలకు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ద్వారకానగర్, గురుద్వార్, అల్లూరి సీతారామరాజు జంక్షన్‌తో పాటు పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలకు చెట్టు కొమ్మలు అడ్డంగా పెరిగి ఎలాంటి సీసీ ఫుటేజీ లభ్యం కాకపోవటంతో సీఐ ఆదేశాల మేరకు సిబ్బంది దగ్గరుండి జీవీఎంసీ సిబ్బందితో చెట్టు కొమ్మలను తొలగింపజేశారు.

సింహాద్రి అప్పన్న కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు పెద్దరాజు తదితరులు కల్యాణం నిర్వహించారు.



బాలల శాఖా గ్రంథాలయంలో గురుపూజోత్సవ దృశ్యం



బీచ్‌రోడ్డు బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ (బ్రిడ్జి స్కూల్)లో..



ఏవీఎన్ కళాశాలలో..



ఎంజీఎం హైస్కూల్ హెచ్‌ఎంను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ సభ్యులు

గురుభ్యో నమః

- పలు పాఠశాలలు, గ్రంథాలయాల్లో ఘనంగా గురుపూజోత్సవం
- పలువురు ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం పొందిన ఎంజీఎం హైస్కూల్ ఉపాధ్యాయులతో అలైన్స్ గ్రూపు సభ్యులు



క్వీన్‌మేరీ పాఠశాలలో మాట్లాడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రరెడ్డి



అత్యధిక మార్కులు సాధించిన జెడ్పీ విద్యార్థిని భార్గవిని సత్కరిస్తున్న అతిథులు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

దాబాగార్డెన్స్/అల్లిపురం/జగదాంబ/మహారాణిపేట : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఉపాధ్యాయల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో గల గ్రంథాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల్ని సత్కరించారు.

బాలల శాఖ గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకున్నారు. జీవీఎంసీ రామచంద్ర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్యామ, కె. పార్వతితో పాటు అంగన్‌వాడీ టీచర్ ఈవీఎస్ గౌరీదేవి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి, పాఠకులు ఎస్. చిన్నారావు, అప్పలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి

బీచ్‌రోడ్డు బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ (బ్రిడ్జి స్కూల్)లో అలయన్స్ క్లబ్ విశాఖపట్నం నార్త్ సంస్థచే గురుపూజోత్సవం జరిపారు. ముందుగా క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు సర్వేపల్లి చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావుని సత్కరించారు. మహిళలు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ 135వ జయంతి కార్యక్రమం, ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు పాల్గొని రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, వర్మ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ ఆధ్వర్యంలో..

వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ ఆధ్వర్యంలోవాసవీ వీక్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఐదవ రోజు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను సత్కరించారు. దీంట్లో భాగంగా అల్లిపురంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం నాగభూషణంను, అసిస్టెంట్ హెచ్‌ఎం శివజ్యోతిలను క్లబ్ చార్టర్ సెక్రటరీ, పైడాకాలేజీ సీనియర్ ప్రొఫెసర్ పెన్నం రత్నాజీరావు, క్లబ్ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు తదితరులు సత్కరించారు.

ఉపాధ్యాయులే దేశానికి వెన్నుముక

మంగళవారం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో అలైన్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అలైన్స్ గ్రూపు గవర్నర్ విద్యాసాగర్ తదితరులు ఉపాధ్యాయులను సత్కరించారు.

మోడల్ స్కూల్‌లో..

మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్స్ అలరించాయి.

క్వీన్‌మేరీ బాలికల పాఠశాలలో..

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని క్వీన్‌మేరీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం గురుపూజోత్సవం, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా 39వ వార్డులో ఉన్న క్వీన్‌మేరీ బాలికల పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి చికిత్సాలయంలో..

శ్రీ గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిష్లా లక్ష్మీనారాయణ, రాజీవ్‌గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో..

- హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాలలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్, డాక్టర్ రామారావు, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో 563 మార్కులు సాధించిన భార్గవికి గోల్డ్‌మెడల్, నగదు ప్రోత్సాహకం అందజేశారు.

ఏవీఎన్ కళాశాలలో.

ఏవీఎన్ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించారు. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, పైడి రజని, డీన్ శంకరనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 29వ వార్డు మహారాణిపేటలో గల గుంటూరు ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ హరిత ప్రగాఢ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు మంగళవారం 20వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

7న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



లక్ష్మీ టాకీస్ ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత సీట్లు, కళాశాలల్లో అడ్మిషన్లు, ఉద్యోగాలు వంటి సమస్యల పరిష్కారానికి తక్షణమే సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉచిత ఇళ్ల స్థలాలు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు కావాలని వచ్చిన వినతులకు సంబంధించి అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మలేషియాకు సాయి కోలాటం సభ్యులు



సాయి కోలాటం సభ్యులు

సీతమ్మధార: అన్నమయ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 27వ తేదీన మలేషియాలో జరగనున్న శ్రీనివాస కల్యాణంలో పాల్గొనేందుకు సీతమ్మధారకు చెందిన సాయి కోలాటం సభ్యులు పది మంది ఎంపికయ్యారు. వారు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయి ఆలయంలో ఈవో శేఖర్ బాబు, ప్రధాన అర్చకుడు రాజా స్వామి, ట్రస్ట్ సభ్యుల సహకారంతో ప్రతి రోజు ఆలయ ఆవరణలో శిక్షణ పొందుతున్నారు. శ్రీ వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఏపీ, తెలంగాణ డైరెక్టర్ సునీత కొఠారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. కాగా కోలాటం సభ్యులకు తిరుపతికి చెందిన శేష్మ శిక్షకురాలిగా వ్యవహరిస్తున్నారు. విశాఖ నుంచి 25వ తేదీన బయలుదేరిన బృందం 27న మలేషియాలో ప్రదర్శన ఇస్తుందని కోలాటం శిక్షకురాలు పద్మజ తెలిపారు. తాళ్లపాక అన్నమాచార్యుల 12వ వంశీకులతో పాటు ప్రదర్శన ఇస్తారన్నారు. ఇప్పటి వరకు సాయి కోలాటం సభ్యులు షిర్డీ, సింహాచలం, దేవీపురం, అనకాపల్లి, విజయవాడతో పాటు పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

యువతపైనే దేశ భవిత

ఏయూక్యాంపస్: యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన యువజన అభివృద్ధి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ సేవా పథకం యువతను మార్పునకు సాధనాలుగా తయారు చేయాలని, తద్వారా వారిని నిపుణులైన మానవ వనరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక కార్యకర్త ఆచార్య కె.శేఖర్ మాట్లాడుతూ యువతకు కెరీర్ కౌన్సెలింగ్ ఎంతో అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈ దిశగా యువతకు మార్గనిర్దేశం చేయాలన్నారు. యువతలో నైపుణ్యాలను వృద్ధి చేయాలని, దేశానికి సంపద సృష్టించే ప్రక్రియలో వారిని భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా యువత - మత్తు పదార్థాలు, యువత-రిస్క్ బిహేవియర్, యువత-మాతృభాషలో విద్యాబోధన, యువత-సామాజిక మాధ్యమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

పలువురు ప్రముఖులకు ఘన సత్కారం

బీచ్‌రోడ్డు: శిష్టకరణ సామాజిక వర్గంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని మంగళవారం శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయిక్ ఘనంగా సత్కరించారు. రామ్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌జేడీ మణిపాత్రుని జ్యోతి కుమారి, మన్యం జిల్లా డీఎస్పీ బలివాడ నాగేశ్వరరావు, సినీ నిర్మాత బాలాజీ రామలింగం, పౌరాణిక నటులు డొంకాడ రామచంద్రరావు, సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిష్టకరణ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు కె.వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎస్‌కే మహంతి, ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.

అలరించిన 'స్తోత్ర గాన ఝురి'



కీర్తనలు పాడుతున్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో 'స్తోత్ర గాన ఝురి' ఆధ్యాత్మిక కార్యక్రమం ఆద్యంతం అలరించింది. శ్రీకంచి కామకోటి శంకర మఠం విశాఖపట్నం, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమాన్ తాళ్లపాక స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామీజీని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పాడిన సంకీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో మఠం కార్యదర్శి అచ్యుత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల అందజేత



కొత్త పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు పరిధి జ్ఞానాపురం కాయిత మరియదాస్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, జీసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ ముఖ్య అతిథులుగా వైఎస్సార్ ఆసరా పెన్షన్ కానుకను అందజేశారు. అక్కచెల్లెమ్మలు, దివ్యాంగులకు కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చల్లని మనసుతో వార్డులో 20 మందికి కొత్త పెన్షన్లు అందించడం ఎంతో ఆనందంగా ఉందని కార్పొరేటర్ పూర్ణిమ అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, సీవో గణేష్, వేళంగణి రావు, అన్నపూర్ణదేవి, ఈశ్వరి, ఆనంద్, రజిని శ్రీను, శ్యాంసుందర్‌రెడ్డి, కమల, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : ద్వారకానగర్‌లోని ఎక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలుఅందించే బ్యాంకులకు ఆదరణ ఉంటుందన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంక్ ఆపరేషన్ మేనేజర్ జి.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పదిహేను వందల బ్రాంచిలు ఉండగా, ఏపీలో 15 బ్రాంచిలు ఉన్నాయని తెలిపారు. విశాఖ బ్రాంచి నుంచి రెండు వందల కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూపిటర్ హోండా షోరూం అధినేత యల్లపు రఘురాం, బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గోపికల వేషధారణ



గోపిక వేషధారణలో జయంతి ఫణి కాత్య

మహారాణిపేట : శ్రీ గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో పాల్గొన్న బీజేపీ మెడికల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రూపాకుల రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అందరికీ భగవద్గీత మార్గదర్శి అన్నారు. చిన్నారులు జయంతి ఫణి కాత్య, క్షీరాబ్ది దుతి గోపికల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, ఎస్. మహేష్, చాతుర్య, గేదెల శ్రీహరి, డాక్టర్ వై. లక్ష్మణరావు, గౌరీ శంకర్, మంగ, రమణ, కొండమ్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్‌పీల జీతాలు వ్యక్తిగత అకౌంట్లలో జమ చేయాలి

సీతమ్మధార : మెప్మా ఆర్‌పీల వ్యక్తిగత అకౌంట్‌లో వేతనాలు జమ చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఏపీ మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) విశాఖ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షురాలు పి.మణి అన్నారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ జాబ్ చార్ట్ ఇవ్వాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ వేతనాలు వ్యక్తిగత అకౌంట్లలో వేయాలని, పని భారం తగ్గించాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, యూనిఫాం, ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు. పది లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సరస్వతి, దుర్గాసాయి, బి.లక్ష్మి, పి.లలిత, కల్యాణి, జయ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట

దాబాగార్డెన్స్ : సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోవడంతో ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు, అధ్యక్షుడు నూకరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవా రం సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 16న కార్మిక డిమాండ్లపై జరిగిన ఒప్పందం సందర్భంగా తాత్కాలికంగా సమ్మె వాయిదా వేశామన్నారు. గత నెల 31లోగా మొత్తం 38 డిమాండ్లు పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారని, గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క డిమాండ్ పరిష్కరించలేదని, సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి సమ్మె బాట పట్టనున్నారని తెలిపారు. పారిశుధ్య విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం, యూజీ డీ, పబ్లిక్ హెల్త్ డ్రైవర్లు, వెటర్నరీ, జనాభా, విస్తీర్ణం ఆధారంగా సిబ్బందిని పెంచా లని తదితర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్. రమణ, జె. నాయుడు పాల్గొన్నారు.

ముగింపు సభను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం : రాష్ట్రాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో సీపీఐ చేపట్టిన రాష్ట్రస్థాయి బస్సు యాత్ర ఈ నెల 8న తిరుపతి సభతో ముగుస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. బస్సుయాత్ర ముగింపు సభ ప్రచార పోస్టర్‌ను మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎస్వీ హై స్కూల్ గ్రౌండ్ నుంచి తిరుపతి మున్సిపల్ గ్రౌండ్ వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే రెహమాన్, సీఎన్ క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, నాయకులు జేడీ నాయుడు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.